ఖనిజాల అన్వేషణకు అధునాతన పద్ధతులు

గనుల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి సంజయ్‌లోహియా


సదస్సును ప్రారంభిస్తున్న గనుల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సంజయ్‌లోహియా

మన్సూరాబాద్: నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ (ఎన్‌ఎంఈటీ)కి సమర్పించేటపుడు ప్రాజెక్టు రూపకల్పన ఆమోదం సమయంలో ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తామని గనుల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి సంజయ్‌లోహియా అన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో(జీఎస్ఐటీఐ)లో శిక్షణ సదస్సును ఆయనతో పాటు జీఎస్ఐ డీజీ జనార్ధన్ ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్ లోహియా మాట్లాడుతూ.. ఖనిజాన్వేషణ ప్రాజెక్టులకు ముఖ్యంగా వ్యూహాత్మక, అరుదైన క్లిష్టమైన ఖనిజాల అన్వేషణకు జియో సైంటిస్టులకు అవసరమైన జ్ఞానం, సాధనాలను అందించేందుకు శిక్షణ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. ఎన్ఎంఈటీకి సమర్పించేటప్పుడు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. జీఎస్ఐ డైరక్టర్ జనరల్ జనార్ధన్‌ప్రసాద్ మాట్లాడుతూ జీఎస్ఐటీఐలో శిక్షణ సదస్సు నాలుగు రోజుల పాటు ఉంటుందని, మొదటి రోజు నేషనల్ జియోసైన్స్ డేటా రిసోజిటరీ(ఎన్‌జీడీఆర్) పోర్టల్, కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ అధునాతన సాంకేతికలు అనే అంశపై శిక్షణను నిర్వహించామని తెలిపారు.

రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తున్న బీజేపీకి బుద్ధిచెబుదాం


సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా సీపీఎం నేతలు

మన్సూరాబాద్: రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తున్న మతతత్వ బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడిద్దామని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం. చంద్ర మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డిలు పిలుపునిచ్చారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ముఖ్యనాయకులతో ఆదివారం రాత్రి మన్సూరాబాద్ ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో గంటిపాకం ముత్యాలు అధ్యక్షతన ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని భువనగిరి ఓటర్లు 2 వేల మందికి తగ్గకుండా సమీకరించి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక, రైతు చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేసే లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చారని మండిపడ్డారు. చిన్ననాటి నుంచి ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటున్న భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆలేటి ఎల్లయ్య, వెంకన్న, కనకయ్య పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం


ధరిత్రిని కాలుష్యం నుంచి కాపాడతామని ప్రమాణం చేస్తున్న కాలనీవాసులు

వనస్థలిపురం: భూమిని మనం కాపాడితే భూమాత మనల్ని రక్షిస్తుందని, చెట్టు, చేమ, జంతు జాలం అన్నింటికీ ఆహార సంపదలను సమకూర్చి కన్నతల్లిలా మనను కాపాడుతుందని ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ మెంబర్ డా.శిరిపురపు అప్పారావు అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ ఆధ్వర్యంలో వనస్థలిపురం శారదానగర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భూమాత గర్భ శోకానికి కారణమయ్యే ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధిస్తామని కాలనీవాసులతో శారదానగర్ కాలనీ కార్యదర్శి కేఎల్.నర్సింహారావు ప్రమాణం చేయించారు. సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు సీహెచ్‌వీఆర్‌కే.మూర్తి, పర్యావరణ వేత్త కొండవీటి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథసేవ


ఊరేగింపులో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, నాయకులు

చంచల్‌గూడ: సీతారామకల్యాణమహోత్సవంలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి ఉప్పరిగూడ రామాలయంలోని సీతారామ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను కుర్మగూడ, రెయిన్‌బజార్, చావణీ డివిజన్ పరిధిలోని పురవీధుల్లో ఊరేగించారు. రథసేవ సోమవారం ఉదయం వరకు కొనసాగింది. శ్రీ రామభక్త సమాజం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం కొనసాగింది. మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, నాయకులు నిరంజన్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, తంగెళ్ల సుధీర్, ఉగాది మహేష్, కామాటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. నీరు రోడ్లపాలు


బీఎన్‌రెడ్డినగర్‌లోని శివసింధు చౌరస్తా వద్ద వాల్వు వద్ద లీకవుతున్న నీరు

ఎల్‌బీనగర్: అసలే వేసవికాలం అపై నీటి ఎద్దడి .. దీనికి తోడు అక్కడక్కడా నీరు లీకేజీలు కావడంతో వచ్చే నీరు ప్రెషర్ తగ్గుతుంది. దీంతో పలువురు నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యంతో తరచూ వాల్వుల వద్ద నీరు లీకేజీ అయి రోజూ నీటి సరఫరా వేళలో వృథాగా పోయి రోడ్లపాలవుతున్నాయి. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో శివసింధుచౌరస్తాలో వద్ద వాటర్ లీకేజీ అవుతోంది. రోజుల తరబడి నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీ భవన స్థలం కబ్జా

కమిషనర్‌కు ఫిర్యాదు


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాదర్‌గుల్ వాసులు

బడంగ్‌పేట్: గ్రామ పంచాయతీ భవన స్థలాన్ని మాజీ సర్పంచ్ తనయుడు కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని బడంగ్‌పేట వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కాక ముందు అందులో విలీనమైన గ్రామ పంచాయతీలో నాదర్‌గుల్ అతిపెద్ద గ్రామ పంచాయతీ. దీనికి జిల్లాలోనే అతిపెద్ద రెవెన్యూ వచ్చే పంచాయతీకి గుర్తింపు ఉంది. ఈ పంచాయతీ సొంత భవనాన్ని 50 ఏళ్ల క్రితమే నాటి పాలకులు నిర్మించుకొని గ్రామానికి సేవలు అందించారు. దీంతో అదే గ్రామానికి చెందిన ఓ మాజీ సర్పంచ్ కుమారుడు గ్రామ పంచాయతీ భవనం తమదేనని రికార్డులు చూపిస్తూ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని వారు పేర్కొన్నారు. విషయం తెలిసిన మాజీ ఎంపీటీసీ కందాడి శ్రీరాం రెడ్డి, గ్రామస్తులతో కలిసి అడ్డుకున్నారు. ఆ స్థలం ప్రస్తుతం కొనసాగుతున్న బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందినదని, అట్టి స్థలాన్ని పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్ రఘుకు వినతిపత్రం అందచేశారు. వినతిప్రతం ఇచ్చిన వారిలో కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్, బంగారు శంకర్, వెంకటేశ్ యాదవ్, మర్రి తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎం వెంకట్‌రెడ్డి, యాతం మహేందర్‌యాదవ్, శివకుమార్, శ్రీధర్, నర్సింగ్, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



సీపీఐ సరూర్‌నగర్ మండల కమిటీ సభ్యులను సన్మానం చేస్తున్న దృశ్యం

నాగోలు: ప్రజా సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రచారి అన్నారు. సోమవారం సరూర్‌నగర్ మండల సీపీఐ నిర్మాణ మహాసభ నాగోలు డివిజన్ బండ్లగూడలో బోయపల్లి రాములు గౌడ్ అధ్యక్షతన సీపీఐ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి దళితులు, మైనారిటీల పైన దాడులు జరుతున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో సరూర్‌నగర్ సీపీఐ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సరూర్‌నగర్ మండల కార్యదర్శిగా బాతరాజు నరసింహ, సహాయ కార్యదర్శులుగా కందుల సుధాకర్, బోయపల్లి రాములుగౌడ్‌తో సహా 27 మంది కౌన్సిల్ సభ్యులు, 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ హయత్ నగర్ మండల కార్యదర్శి పాముడి శేఖర్ రెడ్డి, సీపీఐ నాయకులు మారగొని ప్రవీణ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

'బీజేపీకే మా మద్దతు'

దిల్‌సుఖ్‌నగర్: హిందూ ధర్మం కోసం, దేశం కోసం, సత్సంప్రదాయాల కోసం కాపాడే ఏకైక పార్టీ బీజేపీ అని దేవీ ఉపాసకులు, బీజేపీ దార్మిక పరిషత్ కన్వీనర్ సభ్యులు బ్రహ్మశ్రీ నారాయణం చక్రవర్తి అన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురిలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బ్రాహ్మణ సంఘాలు బీజేపీకి మద్దతు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. బీజేపీ ధార్మిక పరిషత్ కన్వీనర్ అన్నావఝల సూర్యప్రకాశ్, కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్ పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివెళ్దాం

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివెళ్దామని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ పేర్కొన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్‌హిల్స్ కాలనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్‌లో మరోసారి గులాబీ జెండా ఎగురవేద్దామన్నారు. రాజేంద్రనగర్‌లో మంగళవారం నిర్వహించే కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ కార్యక్రమానికి మద్దతు తెలుపుదామని అన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారన్నారు.

యూపీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం


యూపీఎస్సీ ర్యాంకర్ ధీరజ్‌రెడ్డిని సన్మానిస్తున్న శుభోదయకాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

మన్సూరాబాద్: యూపీఎస్సీ ఫలితాల్లో 173వ ర్యాంకు సాధించిన మన్సూరాబాద్ డివిజన్ శుభోదయకాలనీకి చెందిన సత్యనారాయణ రెడ్డి, హేమలత దంపతుల కుమారుడు ధీరజ్ రెడ్డిని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బద్దం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, కోశాధికారి రాజేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు మల్లేశం, కాలనీవాసులు శ్రీనివాస్‌గౌడ్, రమణా రెడ్డి, నవీన్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కుర్మగూడ డివిజన్‌లో బీజేపీ నేతల ప్రచారం


చంద్రయ్యహట్స్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్‌లో సోమవారం లోకసభ ఎన్నికల ప్రచారం ప్రారంభమైంది. సోమవారం ఉదయం డివిజన్ బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ ముందుండి ప్రచారం కొనసాగించారు. చంద్రయ్య హట్స్‌లో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్ రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, తంగెళ్ల సుధీర్, ఉగాది మహేష్, అజయ్, మోహన్‌కృష్ణ, గౌతమ్, వరుణ్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

బడంగ్‌పేట్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ కార్పొరేషన్ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని మహిళా డ్వాక్రా సాధికారిక భవనం ఆవరణ నుంచి అల్మాస్‌గూడ చౌరస్తా వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన


ఆలయ పునరుద్ధరణ పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ దుర్గానగర్ కాలనీలోని శ్రీపోచమ్మ ఆలయ అలయ పునరుద్ధరణ పనులకు సోమవారం ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణలతో సింహవాహనం, బలిపీఠం, పోతలింగంలను పునఃప్రతిష్టించారు.ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు చీర శ్రీనివాస్, సురేష్, బీరప్ప, గణేష్, నర్సింహ్మా, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం


కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

సైదాబాద్: జైల్‌గార్డెన్‌లో స్వయంభువుగా వెలిసిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 52వ వార్షికోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. వేడుకల్లో రెండవ రోజైన సోమవారం ఆలయంలోని కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో చండీ హోమం నిర్వహించారు. ఆలయ పూజారి మడుపతి నాగరాజు ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసారు. ఉత్సవాల ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ మధుకర్, ఉపాధ్యక్షులు మదన్‌బాబు, కృపానంద్, ఎంఎస్ఎన్ వెంకటరావు, శ్రీకాంత్, ఎన్.శ్రీకాంత్, వెంకటరమణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: ప్రజాసంక్షేమ పాలన కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి సమక్షంలో రామకృష్ణాపురం డివిజన్ బీఆర్ఎస్, బీజేపీ నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, పిట్ట హరినాథ్ రెడ్డి, టీపీసీసీ ఎన్నికల ఇంచార్జి నిజాముద్దీన్, నేరేళ్ల శారద పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి


కొత్తపేట బాలాజీ నగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్‌లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో బాలాజీ నగర్‌లోని మురుగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. కొత్తపేట డివిజన్ బాలాజీ నగర్ కాలనీలో రోడ్ నెంబర్ 6లో డ్రైనేజ్ నీరు తాగునీటి బోరు బావిలో కలుస్తున్నాయని స్థానికులు కార్పొరేటర్ పవన్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ సోమవారం బాలాజీ కాలనీ వెళ్లి సమస్యను పరిశీలించారు. కార్పొరేటర్ సమస్యను పరిశీలించి జలమండలి అధికారులతో మాట్లాడారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న రామచంద్ర, పద్మ

హయత్‌నగర్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖ ప్రకృతి వైద్యులు రామచంద్ర, పద్మ అన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని గాంధేయన్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న కాలుష్యం కారణంగా భూమి తన సహజత్వాన్ని కోల్పోయే పరిస్థితి ఎర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. భూమి సహజత్వాన్ని కాపాడటం ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఇందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వారు కోరారు. ఈ సందర్భంగా గాంధీగ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ధరిత్రిని కాపాడుతాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఏఓ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు.. సురేందర్, చైతన్యరెడ్డి, శివారెడ్డి, సుభాష్‌చంద్ర, రఘురాం, సాయి, నీరజ్, జానత్‌ఉన్నీసా, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా రక్షణకు నిరంతరం కృషి చేయాలి

చార్మినార్: లక్షలాది మంది అభ్యర్థులతో పోటీ పడి ఉద్యోగాలు పొందిన మీరంతా శిక్షణా కాలం అనంతరం ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు వారి ఆస్తులను కాపాడడంలో నిరంతరం కృషి చేయనున్నారని ఐపీఎస్ అధికారి అడిషనల్ డీజీపీ అభిలాష బిస్త్ అన్నారు. సోమవారం ఆమె పేట్ల బురుజులో ని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించి అక్క డి సిబ్బంది నిర్వహించిన పరేడ్‌లో గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ప్రజా సంక్షేమమే మజ్లిస్ ధ్యేయం


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి కొనసాగుతోందని, అభివృద్ధిని చూసి మజ్లీస్ పార్టీకి ఓటు వేయాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా సోమవారం మలక్‌పేటలో ప్రచారం చేశారు. ఓవైసీని గెలిపించాలని కోరుతూ పార్టీ శ్రేణులతో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్,వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 60, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 21, క్యారెట్ 35. దొండ 28, ఆలు 33, ఉల్లి 19, గోకర 33, దోస 15, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 35, మునగ 21, చిలగడదుంప 65, బీట్‌రూట్ 19, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 70, క్యాప్సికమ్ 60. ఈధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

డ్రైనేజీ పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఎల్‌బీనగర్: కాలనీ వాసులకు ఇబ్బందుల కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గాయత్రీనగర్ పేజ్-2కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో కాలనీ వాసులు బాగస్వాములు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులురమేష్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సందడిగా గ్రాడ్యుయేషన్ డే


అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులతో ఉపాధ్యాయురాలు పద్మిని

సైదాబాద్: బస్తీ చిన్నారుల్లో చదువు పట్ల ఆసక్తి పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రం ఉపాధ్యాయురాలు ఎస్.పద్మిని తెలిపారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించామని తెలిపారు. చిన్నారులు స్నాతకోత్సవ దుస్తులు, టోపీలు ధరించి సందడి చేసారు. అంగన్‌వాడీలో ప్రీ ప్రైమరీ తరగతులు పూర్తి చేసిన చిన్నారులకు ప్రైమరీ తరగతుల్లో చేరేందుకు అవసరమైన అర్హత పత్రాలను వారికి ఉపాధ్యాయురాలు అందజేసారు. కార్యక్రమంలో కేంద్రం సహాయకురాలు సక్కు, బస్తీ మహిళలు పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి

బడంగ్‌పేట్: ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని పలువురు నాయకులు పేర్కొన్నారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి భర్త పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతి వేడుకలను సోమవారం కొకుంట్లలో నిర్వహించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ నుంచి బీఆర్ఎస్ నాయకులు భీమిడి జంగారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, తదితరులు కొకుంట్లకు తరలివెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ కోసం చేసిన త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఆయన నడిచిన బాటలో మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితారెడ్డి కొనసాగుతూ ఆశయ సాధనకు కృషి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాభవన్ నుంచే పరిపాలన

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ప్రజాభవన్‌గా నామకరణం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇకనుంచి ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రజాభవన్‌గా పిలవాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభించారు. ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ.. ఇకనుంచి దీనిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బదులు ప్రజాభవన్‌గా నామకరణం చేశామని తెలిపారు. ఇక్కడి నుంచే పాలన చేపడతామని అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో ఇబ్రహీంపట్నం రావడం జరిగిందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చినా నేరుగా వచ్చి కలవచ్చని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ మహిపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, నాయకులు.. గోవర్ధన్‌రెడ్డి, గౌస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సందడి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే సంబురాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పరమేష్, ఉపాధ్యాయురాలు బబ్లీ.. విద్యార్థులకు పట్టాలు అందించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. కృషి పట్టుదలతో ఉ న్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. విద్యార్థులు చేప ట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హనుమాన్ జయంతిని శాంతియుతంగా జరుపుకోవాలి

చాంద్రాయణగుట్ట: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పాతబస్తీలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. పాతబస్తీలో నిర్వహించనున్న మొత్తం 14 ర్యాలీలకు సంబంధించిన నిర్వాహకులతో ఇప్పటికే సమావేశాలు ఏర్పాటు చేసి తగిన సూచనలు ఇచ్చామన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలలో నాలుగు ర్యాలీలు నగరంలో జరిగే ప్రధాన ర్యాలీలో కలుస్తాయన్నారు. ర్యాలీలో డీజేలు పెట్టకూడదని, భక్తులంతా శాంతియుతంగా ఊరేగింపు నిర్వహించుకోవాలన్నారు. ముఖ్యంగా కమ్యూనల్ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ ప్రసంగాలు చేయకూడదన్నారు. స్థానిక సిబ్బందితో పాటు జిల్లాల నుంచి 900 మంది పోలీసులు, 10 ప్లటూన్ల టీఎస్ఎస్‌పీ బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు.